# కుక్క తోక చక్కన

_జి. ఆర్. మహర్షి

**అనగనగా ఒక కుక్క. దానికి మహానీలుగుడు. ప్రపంచంలోకెల్లా అందమైంది కుక్కజాతేనని దాని విశ్వాసం. కుక్క విశ్వాస జంతువు కాబట్టి తన అభిప్రాయాన్ని మార్చుకోవడం దానికి ఇష్టముండేది కాదు.**


ఒకరోజు దానికి నిలువెత్తు అద్దం కనిపించింది. తన రూపాన్ని చూసుకొని చెవులు టపటపలాడించింది. తన కోరలని చూసుకొని గోముగా మొరిగింది.

ఇంతలో హఠాత్తుగా దానికి దుఃఖం ముంచుకొచ్చింది. ''అరే! దేవుడనేవాడు ఎంతటి దొంగ! కుక్కలకు ఇంత మంచి రూపాన్నిచ్చి, తోకను మాత్రం వంకరగా చేస్తాడా? ఎప్పుడైనా కనిపిస్తే వాడిని తుక్కుకింద కరిచేయాలి'' అనుకుంది.

దానికి దేవుడు కనిపించలేదు గాని, ఒక రాజకీయ నాయకుడు కనిపించాడు. ఆయన మందీమార్బలంతో హడావిడిగా ఎక్కడికో వెడుతున్నాడు.

ఆయన్ని చూసి కుక్క జాలిపడింది. 'వీడికి తోకలేదుకదా! జోరీగల్ని ఎలా తోలుకుంటాడో పాపం!' అనుకుంది.

కుక్కని చూడగానే నాయకుడు మొత్తం వంగిపోయి ''నమస్కారమండి'' అన్నాడు.



కుక్క కొంచెం కంగారుపడింది. అయినా కొంచెం దర్పాన్ని అభినయిస్తూ ''నమస్కారం, అంతా కులాసేనా?'' అని ప్రశ్నించింది.

నాయకుడు గతుక్కుమని, కళ్లజోడు సవరించుకొని 'ధూ దీనమ్మ! ఇది కుక్కా!' అని మనసులో తిట్టుకున్నాడు. 'అయినా ఎన్నికలొస్తున్నాయి. కుక్కలతో కూడా మంచిగా వుండటం క్షేమం' అనుకున్నాడు.

'' ఏమిటీ విషయాలు? పిల్లా, పాపా అంతా క్షేమమేనా? సంవత్సరానికి ఎన్ని ఈతలు ఈనుతున్నారు?'' ఆప్యాయంగా అడిగాడు నాయకుడు.

కుక్కకు విపరీతమైన కోపమొచ్చింది. ఆ ప్రశ్న దాని అహాన్నే దెబ్బతీసింది. ''కుక్కలకొడకా! కింద చూసి మాట్లాడవాయ్ నేను మగకుక్కని'' తిట్టింది, తోకను విసురుగా వూపుతూ.

నాయకుడు నవ్వుతూ కుక్కను నిమిరాడు

"మన్నించండి, చూపు కాస్త మందం" అంటూ తన వెనుకవున్న ఫోటోగ్రాఫర్‌ని కేకేసి "మంచి ఫోటో లాగించయ్యా, ఇదిగో రిపోర్టరూ! 'జంతుమిత్ర' అని హెడ్డింగ్ పెట్టి అదిరిపోయే బాక్స్ ఐటమ్ వేయించు. రాత్రికి ఫారిన్ సరుకు పోయిస్తాలే" అన్నాడు.

తన ప్రమేయం లేకుండా ఇదంతా జరుగుతుంటే కుక్కకు కోపమొచ్చింది. వీడ్ని ఎక్కడ పట్టి పీకితే కండ ఎక్కువ వూడొస్తుందా అని కాసేపు పరిశీలించింది. గుర్రుమని నిరసన ప్రకటించింది.

ఫోటోగ్రాఫర్ కెమెరా సర్దుకొని "స్మైల్ ప్లీజ్" అన్నాడు.

కుక్క తన వంకరతోక ఫోటోలో పడకుండా జాగ్రత్తగా పోజు పెట్టింది.

"కొంచెం తోక కనిపించేలా నిలబడండి సార్, లేకుంటే నాయకుడికి, కుక్కకి తేడాల్లో ఇబ్బందొస్తుంది" కుక్కకు సలహా చెప్పాడు ఫొటోగ్రాఫర్.

కుక్కకి చిర్రెత్తుకొచ్చింది "పోవయ్యా మగడా, నా తోక వంకరగా వుందని అసలే నేను దిగులుపడి చస్తుంటే, మళ్లీ ఇదొక గోలా" అంది.

ఈలోగా నాయకుడు కుక్కతోకను పట్టుకున్నాడు. కెమెరా క్లిక్ మంది. మంది మార్బలం చప్పట్లు కొట్టారు.

"ఇదిగో నాయకుడా, నా తోక పట్టుకున్నావు, మరేం పర్లేదు. గోదారి మాత్రం ఈదుతాననొద్దు. ముంచేస్తాను" అంది కుక్క.

"జోకులు సరేగాని, ఎలెక్షన్లొస్తున్నాయి. ప్రజాస్వామ్య పరిరక్షణకు మీ వంతు కర్తవ్యం నిర్వర్తించండి" అడిగాడు నాయకుడు.

"అయ్యా! నేను కుక్కని, నాకు ఓటు లేదు" వినమ్రంగా చెప్పింది కుక్క.

"ఫర్వాలేదు. కుక్కనైనా, నక్కనైనా ఎలా వాడుకోవాలో మాకు తెలుసు. పోలింగ్ బూత్‌కొచ్చే అపోజిషనోళ్లని పట్టుకొని కరవండి, అది చాలు మాకు"

కుక్క కోపంతో చెవులు టపటపమనిపించింది. "ఒరే ముచ్చుమొకమోడా! మనకు చాలా పనులున్నాయి. అసలే నా తోకమీద దిగులుతో నేనుంటే, మధ్యన నీదేంది మద్దెలదరువు" అంటూ వెళ్లబోయింది.

నాయకుడు చటుక్కున కుక్కగొంతు పట్టుకున్నాడు.

"పీక మలిమేయగల్ను, నా దగ్గర తోక తిప్పొద్దు, కోసి సున్నం పెడతా" అన్నాడు.

కుక్క గిజగిజలాడింది. కాళ్లబేరానికొచ్చింది.

> **శ్రీ గణపతి ముని వ్యక్తిత్వం**
>
> తిరుపతి వేంకట కవులు ప్రతి సభలో "సంస్కృతంలోగాని, తెలుగులోగాని మమ్మల్ని మించిన వారుంటే రావచ్చు. ఈ మీసం తీసేస్తాం" అనేవారు. ఒకసారి అలా అర్థం వచ్చే పద్యం ప్రారంభించగానే ఎవరో వచ్చి, చెవిలో ఆ సభలో ఎవరో వున్నట్లు చెప్పగానే, వెంటనే తిరుపతి కవులు స్టేజి దిగి వచ్చి, వారికి నమస్కరించి "అపరాధం క్షమించండి. మీరు సభకు వస్తారని అనుకోలేదు" అన్నారు.
>
> ఇంతకూ ఆ వ్యక్తి వారితో పోటీపడే శతావధానికాడు. మహర్షి తుల్యుడైన వసిష్ఠ గణపతి ముని. మౌనవ్రతాన్ని పాటించే రమణ మహర్షి ఈయన కోసమే నోరు విప్పారు.
>
> — డాక్టర్ మల్లిప్రియ "నాగరాజు"

"నన్నేం చేయొద్దు, మీ ప్రజాస్వామ్యాన్ని నా కోరలతో కాపాడుతాను" అంది వణికిపోతూ.

నాయకుడు గొంతు వదిలాడు.

"అలారా దారికి, ఇందాక నీ తోక గొడవేదో చెప్పావు. ఏంటి విషయం" అడిగాడు నాయకుడు.

కుక్క గొంతు సవరించుకొని "మా కుక్కల జాతి ఎంతో శ్రేష్టమైంది కదా..."

"సెల్ఫ్ వద్దు విషయానికి రా!"

"తోక వంకరగా వుండటం చాలా సిగ్గుగా వుందండి" సూటిగా విషయాన్ని చెప్పింది.

"చూడూ, నీకు బుద్ధి లేదు"

"అందుకే కదండి కుక్కనయ్యాను"

"మనలో ఏదైనా వంకరుంటే, దాన్ని ప్రత్యేకలక్షణంగా ప్రచారం చేయాలి. అదే తెలివంటే! పూర్వం మా రాజకీయాలకు త్యాగం, ప్రజాసేవ ఇలాంటి పూతలన్నీ వుండేవి. వంకరబుద్ధిని బయటకు చాటడానికి కొంచెం ఇబ్బంది వుండేది. ఈ ప్రమాదాన్ని మాలాంటివాళ్లు గుర్తించి వంకరకు పబ్లిసిటీ ఇచ్చాం. ఇప్పుడు వంకరే మాకు అర్హత. సారా వ్యాపారాలు, గూండాయిజం, హత్యలు ఇవే ఇప్పుడు రాజకీయ నాయకుడి ప్రత్యేక క్వాలిఫికేషన్లు.

"ఈ మైక్ తీసుకొని వెళ్లి నీ తోక గురించి గొప్పగా ఉపన్యాసాలు మొరుగు. నాకు పనుంది. ఇక వెళ్లు"

కుక్క మైక్ తీసుకొని, అటు ఇటు తిప్పి కొరకబోయింది. మింగుడు పడలేదు. 'హుష్'మని వూదింది. పెద్ద పెద్ద గాలిబుడగలు వచ్చాయి.

"ఇవేంటండీ" - భౌభౌలాడింది.

"అదంతే అందులో గాలి మాటలే మాట్లాడాలి" రాజకీయ నాయకుడు వెళ్లిపోయాడు.

కుక్క మైక్ చేతపట్టి, వంకరతోకను అలంకరించుకుని అడవిలోకి బయలుదేరింది.

'మనుషుల పాదాలు నాకే కుక్క, అడవిలోకి ఎందుకొచ్చిందబ్బా?' అని ఆశ్చర్యపోయాయి జంతువులు.

కుక్క తన వంకర తోకను అటూ ఇటూ వూపి, మోర పైకెత్తి ఆనందంతో మొరిగి, ఉపన్యాసాన్ని మొదలుపెట్టింది.

"నా ప్రియమైన జంతువులారా! మన కందరికీ తోకలున్నాయి. అయితే నాకు మాత్రం వంకరతోకుంది. ఈ విషయంలో నేను దిగులుపడేదాన్ని. కానీ నిన్నటితో నాకా బాధ తీరిపోయింది. రాత్రి నాకు కలలో జంతు దేవత కనిపించింది."

దేవత పేరు వినగానే జంతువులన్నీ భక్తితో లెంపలేసుకున్నాయి.

"దేవత ఎలా వుందనుకున్నారు? ఆరుకాళ్లు, నాలుగుకొమ్ములు, ఒళ్లంతా బొచ్చు, నోటి నిండా కోరలు - అద్భుత స్వరూపం. నేను రెండుకాళ్లు పైకెత్తి నమస్కరించాను. 'కుక్కా!' అని దేవత ఆప్యాయంగా పిలిచింది. నోటమాట రాక కుయ్యికుయ్యిమని మూలిగాను. 'ఏమిటి నీ బాధ' అని అడిగింది. నేను దుఃఖంతో నాలుక పొడుగ్గా చాచి, నా వంకరతోకను చూపించాను. "పిచ్చి కుక్కా!' అంటూ దేవత నవ్వి, వెనక్కి తిరిగి తన తోక చూపించింది. అద్భుతమైన వంకరతోక.

"వంకరతోక దేవతలకు తప్ప అన్యులకు లభ్యం కానిది. ఈ తోక ద్వారా బొందితో స్వర్గానికి ఎగబాకొచ్చు. ఈ విషయాన్ని మిగిలిన జంతువులతో గర్వంగా చాటు వెళ్లు" అంది."

కథ వినగానే జంతువులు 'బుస్'మని నిట్టూర్చాయి. కుక్క అదృష్టానికి అసూయపడ్డాయి. తమ తోకలను నేలకేసి కొట్టాయి. సామూహికంగా దుఃఖించాయి.

తను వచ్చిన పనిపూర్తికాగానే 'భౌ భౌ' రాగం పాడుకుంటూ వెళ్లిపోయింది కుక్క.

* * *

పదిరోజుల తర్వాత, జంతువుల వద్ద డంబాలు చెప్పకోడానికి కుక్క మళ్లీ అడవికి బయలుదేరింది.

అడవిలోకి అడుగు పెట్టగానే కుక్క విస్తుపోయింది. అడవిలో రాజకీయనాయకుడు కనిపించాడు. ఒక రేకులషెడ్ ముందు జంతువులన్నీ వరుసలో నిలబడి వున్నాయి.

కుక్కని చూడగానే ''రండి కుక్కగారూ!'' గౌరవంగా పిలిచాడు నాయకుడు.

''ఏమిటిదంతా?'' ఆశ్చర్యంగా అడిగింది కుక్క.

''బోర్డుందిగా, చదవండి''

ఒక్కో అక్షరం కూడబలుక్కుని చదివింది ''ఇచ్చట తోకలు వంకర వేయబడును'' ఫీజు జంతువులవారీగా వేసి వుంది.

''అసలీ ఐడియా ఇచ్చింది నువ్వేనయ్యా, వ్యాపారానికి జంతువులూ మనుషులంటూ తేడా లేదు. ఆల్ రెడీ నీ తోక వంకరగా వుంది, లేకుంటే ఫ్రీగా వంకర వేయించేవాడిని'' చెప్పాడు నాయకుడు.

ఈలోగా కొన్ని జంతువులు తమ తోకను వంకరగా వుండేలా క్లిప్పలు బిగించుకొని, షెడ్ నుంచి బయటికి వచ్చాయి. అవి కుక్కను చూసి 'హిహిహి!' అని ఇకిలించి, తమ వంకర తోకలను విలాసంగా తిప్పాయి.

కుక్కకు రోషం వచ్చింది. 'ఈ కంత్రీ వెధవకి బుద్ధి చెప్పాల్సిందే లాభం లేదు' అనుకుంది.

సిమెంట్ స్తంభంలా నిలబడి వున్న నాయకుడి వద్దకు వెళ్లి కాలెత్తి వుచ్చపోసింది. కసితీరా పిక్కను కరిచి పారిపోయింది.

నాయకుడు కెవ్వుమని ''కుక్కనాకొడకా! ఎంతపని చేసావురా!'' అని అరిచాడు.

కుక్క, నాయకుడికి అందనంత దూరం పరిగెత్తి ''ఒరే! నీ పిండం పిల్లులకి పెట్టా! నాకు రెండు రోజుల క్రితం పిచ్చి పట్టింది. పిచ్చికుక్క కాటు అంటే మజాకా కాదు. ఇక నీ చావు నువ్వు చావు'' అంది.

ఆ మాటకు నాయకుడు నవ్వి ''ఓసే! కుక్క మొగందానా! నువ్వు కరిచింది రాజకీయ నాయకుడిని. రెండురోజుల్లో నీకు కుక్కచావు తప్పదు. బతికుంటే నాలుగు బొమికలేరుకొని బతకొచ్చు. వెంటనే డాక్టర్ వద్దకెళ్లు'' అని సలహా ఇచ్చాడు.

''వీడు మనిషీ కాదు, జంతవూ కాదు-ఏ డాక్టర్ దగ్గరికి వెళ్లేదబ్బా!'' ఆలోచించింది కుక్క. ఈ విషయం తేల్చుకునే లోగా కుక్కకు స్వర్గం సంప్రాప్తించింది. ■

# మీదృష్టిలో...

## * 'ఆకాశానికి నిచ్చెన' అంటే?



''అందని దానికి ఆశ పడటం!''
— జి. సునీత, విజయనగరం



''ప్రతి క్లాసులో రెండేండ్లు వుంటూ ఐ.ఎ.ఎస్. అవ్వాలని అనుకోటం!''
— పి. భారతి, పీలేరు



ఎల్లలకు వ్యూ మాస్టర్ చూపించే వాడు 70 ఎం.ఎం. థియేటర్ కట్టాలని అనుకోడం!''
— పి. సుచరిత, వెల్లూరు



''జీవితంలో ఫెయిల్ అయితే నిచ్చెనతో వాల్ పోస్టర్లు అంటించడం!''
— అత్తి రవికుమార్ యాదవ్, అత్తిలి



''సినిమా తీయక ముందే సూపర్ హిట్‌గా వూహించడం!''
—పారుపురెడ్డి శ్రీహరి, పామర్రు



''యం.యల్.ఎ. ముఖ్యమంత్రిగా ఊహించుకోటం!''
— యం. బాబు, కాళహస్తి



''అది ఒక పరమపద సోపానంలో నిచ్చెన!''
— జి. ప్రత్యూష, హైదర్‌నగర్



''ఎగ్జిబిషన్‌లో జైంట్ వీల్ ఎక్కి విమాన ప్రయాణం అనుకోటం!
— ఎన్. రత్నకుమారి, నిడదవోలు



''అందదని తెలిసినా ఆరాటపడటం!''
—శ్రీపాద జానకీరాణి, బొబ్బిలి



''ఒకేసారి పైకి రావాలనే కోరిక!''
— నిమ్మల గణేష్, పి. గన్నవరం



''విస్తరాకులు ఎత్తుతూ పెళ్ళి పెద్దగా ఊహించుకోడం!''
— యం. ప్రతాప్ కుమార్, అద్దంకి



''జీతం 'రాళ్ళ'తో ఇల్లు కట్టాలని అనుకోడం!''
— ఎ. రాంబాబు, గోదావరిఖని



''ఆ నిచ్చెనకు మెట్లు వుండవండి!''
— జి. విజయ శోభా రాణి, రామన్నపేట



స్టేజీ మీద నుండి, ఎదర పది మంది వుంటే లక్ష మందిగా భావించటం!
— వై.వి. విజయలక్ష్మి, ఏలూరు



''స్వర్గానికి మెట్లు!''
— చిట్టూరి చంద్రకళ, తాటిపాక



''అందని దానికోసం అర్రులు చాచడం!''
— నగిరిశెట్టి సుబ్రహ్మణ్యం, పాలూరు



''నిచ్చెనకు మొదలే గాని చివరంటూ లేనిది!''
— పి. షమీర్‌ఖాన్, కుమ్మరవాండ్లపల్లి



''ప్లాస్టిక్ సామాన్లకు బెలూనులు అమ్ముతూ వజ్రాల వ్యాపారం అనుకోడం!''
— చల్లారామారావు, ఖమ్మం



''మన దేశం విదేశాలకు అప్పులివ్వాలని ఆశ పడటం!''
— కోట సుబ్బలక్ష్మి, బొబ్బిలి



''ఏడంతస్తుల మేడకు నీళ్ళు జల్లుతూ ఓనరునని అనుకోటం!''
— బి. పద్మప్రియ, కర్నూలు



''దివ్యభారతితో కలలు కనడం!''
— పి. ప్రకాశ్‌బాబు, సూళ్ళూరుపేట



''నగ్మా పక్కన నటించాలి అనుకోడం!''
— కండి ప్రసాదరావు, బొబ్బిలి



''సముద్రానికి ఆనకట్ట కట్టడం!''
— కె. భీమసేనరావ్, రాయ్‌చూర్ రోడ్



''కర్ర పుల్లను పట్టుకుని మెషిన్‌గన్ అని ఊహించుకోడం!''
— జైపాల్‌రెడ్డి, వరంగల్



''పేలపిండి కథ లాంటి నిచ్చెన!''
— లక్ష్మణ్, రావులపాలెం



''రూపాయి లాటరీ టిక్కెట్టుతో పది లక్షల ఆశ!''
— కాకరపర్తి సుబ్రహ్మణ్యం, తెనాలి



''రాని ఉద్యోగం!''
— పి. ధనుంజయ రావు, గజపతినగరం



''అందని ప్రేయసి కోసం ఆరాటం!''
— జి. వెంకటేశ్వర రావు, రామన్నపేట



నిరుద్యోగి గజిటెడ్ ఉద్యోగం ఆశించడం
— జి. సునీల్ కుమార్, కొల్లాపూర్



ఆర్.యం.పి. డాక్టర్ యం.యస్.గా ఊహించుకోడం!
— పి.వి.యస్. అప్పాజి, తాటిపాక



''ఊహాలోకంలో విహరించడం!''
— ఎస్. అప్పారావు, బొబ్బిలి



''తపస్సుకు కూర్చున్న క్షణంలోనే బ్రహ్మర్షిగా భావించటం!''
— జగన్ మోహన్, సోమల



''ఇనుప ముక్కలకు ఉల్లిపాయలు అమ్ముతూ స్టీల్ ఫ్యాక్టరీ కట్టడం!''
— ఎస్. రాజు, కళ్యాణదుర్గ



''ఉన్న వాళ్ళ ఆలోచన!''
— ఐ. అంకయ్య, మైపాడు

***ఈ వారం ప్రశ్న! కందకు లేని దురద అంటే?**

● పత్రిక మీ చేతి కందిన వెంటనే ఈ ప్రశ్నకి సమాధానంతోపాటు మీ ఫోటోను కూడా పంపిన యెడల ప్రచురించగలం.